క్లుప్తంగా

రేషన్ డీలర్‌పై 6-ఏ కేసు నమోదు



అక్రమ రేషన్ బియ్యంతో తహసీల్దార్ ప్రభాకరరావు, ఈడీటీ ఓంకార్‌లు

చీరాల టౌన్: పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన రేషన్ డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేశారు. సోమవారం పేరాలలోని 4 నెంబర్ రేషన్ దుఖాణంలో అక్రమంగా బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, పౌరసరఫరాల డీటీ ఓంకార్‌లు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా 84 బస్తాల రేషన్‌బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడంపై డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, అక్రమంగా నిల్వలు చేసిన వారిపి కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ డీలర్లపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉంటుందని అక్రమాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇసుక తవ్వకాలు ఆపాలని రైతుల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

చీరాల టౌన్: మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీలోని సర్వే నెంబర్ 526 నుంచి 546 వరకు ఉన్న భూమిలో ఇసుక తవ్వకాలు చేయడంతో మా పంట పొలాలు చౌడు భూములుగా మారుతున్నాయి.. ఇసుక తవ్వకాలు జరగకుండా చేసి మా పంట భూములను కాపాడాలని ఆ గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కావూరివారిపాలెంకు చెందిన రైతులు కలెక్టర్‌ను కలిసి గ్రామంలో చేస్తున్న ఇసుక తవ్వకాల వలన జరుగుతున్న నష్టాల గురించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే తమపై అక్రమ ఇసుక తవ్వకాలు చేయడం వలన పంట భూములు చౌడు భూములుగా మారుతున్నాయని చిన్న, సన్నకార రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

ఆంజనేయస్వామి వారికి విశేష సేవలు



గరటయ్య దంపతులను సత్కరిస్తున్న శ్రీనివాసకుమార్

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ క్షేత్రపాలకుడు లక్ష్మీ నరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి 68వ వార్షిక తిరునాళ్లలో రెండో రోజు భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, బిందెతీర్థం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సత్య హరిశ్చంద్ర నాటకం, కోలాల ప్రదర్శన అనంతరం ఉష్ణవాహన సేవలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం గటరయ్య దంపతులను దేవస్థాన పాలక మండలి సభ్యుడు కోశ్రీనివాసరావు, ఈవో సుభద్ర సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సెక్రటరీ కుటుంబ సభ్యులకు పరామర్శ

బల్లికురవ: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుంటుపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ చాకిరాల వెంకటసురేష్ (39) భౌతికకాయానికి సోమవారం ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి నివాళులర్పించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, నివాళులతో కుటుంబ సభ్యులను ఓదార్చారు. సురేష్ ఆదివారం అర్ధరాత్రి ఒంగోలు నుంచి అద్దంకి బైకుపై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గుర్త్రై అక్కడిక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. పరామర్శలో గుంటుపల్లి సర్పంచ్ మాదాల కృష్ణకుమారి, శివన్నారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.


ఇక స్మార్ట్‌గా టిక్కెట్

- ఆర్టీసీలో డిజిటల్ సేవలు
- చీరాల డిపోలో 78 యూటీఎస్ టిమ్ సేవలు

చీరాల అర్బన్: కాలం మారింది. ప్రస్తుత ప్రపంచంలో ఇంటర్నెట్‌దే యుగం. అందుకు అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం కూడా కొత్త పంథాను అనుసరిస్తోంది. పూర్తిగా డిజిటల్ సేవలకే ప్రాధాన్యత ఇస్తూ టిక్కెట్ ఇచ్చేందుకు ఆధునిక టెక్నాలజీతో కూడిన ఈ-పాస్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చింది. అలానే నగదు రహిత చెల్లింపులు ద్వారా టిక్కెట్ తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలో చీరాల, పర్చూరు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 86 బస్సులు 78 సర్వీసులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో ఉన్న టిమ్ మిషన్ల స్థానంలో 78 సర్వీసులకు నూతనంగా ఈ-పాస్ యంత్రాలతో సర్వీసులు నడుస్తున్నాయి. కొత్తగా వినియోగించే టిమ్‌లపై ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. గతంలో కంటే ప్రస్తుతం ప్రయాణికుడికి ఇచ్చే టిక్కెట్‌లో పూర్తిస్థాయి సమాచారాన్ని కూడా పొందుపరిచారు. డ్రైవర్, కండక్టర్ కోడ్‌లతో పాటు ఈ-పాస్ నెంబర్, ప్రయాణించే బస్సు నెంబర్‌తో సహా పూర్తి వివరాలు టిక్కెట్‌పై ప్రింట్ అవుతాయి.

డిజిటల్ పేమెంట్..

నూతన విధానంలో టిక్కెట్‌ను కేవలం డిజిటల్ విధానంలో కొనుగోలు చేసుకోవచ్చు. డిజిటల్ పేమెంట్ ద్వారా టిక్కెట్‌ను పొందవచ్చు. చిల్లర సమస్యను చెక్ పెట్టేందుకు టెక్నాలజీని తీసుకువచ్చారు. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా, డెబిట్ కార్డు స్వైపింగ్ చేయడం ద్వారా కూడా టిక్కెట్‌ను కొనుగోలు చేయవచ్చు. దూర ప్రాంతాలైన హైద్రాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. అలానే రిజర్వేషన్, సీటింగ్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతాయి. ఆర్టీసీ వ్యాలెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నగదును నిల్వ ఉంచుకుంటే టిక్కెట్‌ను సులభంగా పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



ఈ-పాస్ టికెట్ మిషన్

ఇవీ ప్రత్యేకతలు...

- మార్గమధ్యంలో సర్వీసు మొరాయిస్తే వేరే బస్సులోకి ప్రయాణికులను పంపించాలంటే ఇప్పటి వరకు ఎస్ఆర్‌లో టిక్కెట్ నెంబర్లు రాయాల్సి ఉండేది. ప్రస్తుతం కొత్తగా బ్రేక్‌డౌన్ ఆప్షన్ తీసుకువచ్చారు. దీని ద్వారా రాతలు లేకుండా వేరే బస్సులోకి తీసుకెళ్లే అవకాశం కల్పించారు.
- ఈ-పాస్ మిషన్ ప్రారంభంలో, చివరలో తప్పనిసరిగా సంకేతాలు అందుబాటులో ఉండాలి. మార్గమధ్యంలో సంకేతాలు లేకపోయినా ఆఫ్‌లైన్‌లో టిక్కెట్ అందజేసే విధానాన్ని ప్రవేశపెట్టారు.
- ఈ మిషన్‌లో స్కాన్ చేసిన వెంటనే వివరాలు వస్తాయి. దీంతో ఎంతమంది పాస్ ద్వారా, టిక్కెట్ ద్వారా ప్రయాణిస్తున్నారనేది సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- ఈ మిషన్‌ల వెనుక కెమెరా కూడా ఉండడంతో మార్గమధ్యంలో ప్రమాదాలు జరిగితే, బస్సు పంక్చర్ అయినా వెంటనే ఫొటో తీసి కండక్టర్లే నేరుగా కార్యాలయానికి పంపించే వెసులుబాటు ఉంటుంది.

> **పారదర్శకంగా టిక్కెట్ ఇచ్చేందుకు అవకాశం..**
>
> ప్రయాణికులకు ఎలాంటి ఆలస్యం లేకుండా పారదర్శకతతో టిక్కెట్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ట్రాకింగ్ విధానంతో పాటు చిల్లర సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. పూర్తి వివరాలు ఈ-పాస్ మిషన్‌లో ఉండడం వలన వేగవంతంగా టిక్కెట్ ఇచ్చేందుకు వీలుంటుంది.
>
> – జీ.శ్యామల, డిపో మేనేజర్

మహిళల ఉన్నతికి పెద్దపీట



ఆశావర్కర్‌ను సన్మానిస్తున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణ చైతన్య

- మహిళా దినోత్సవ సభలో రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: మహిళల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గీతా మందిరంలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు కే బుజ్జి వ్యవహరించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకే పథకాలను అందజేస్తున్నారన్నారు. రాజకీయంగా ఆర్థికంగా ఎదగడం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. మహిళలు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమల వంటికి నెలకొల్పుకుని ఆర్థిక స్వావలంభన పొందాలన్నారు. నేడు స్త్రీలు అన్ని రంగాల్లోనూ ముందున్నారన్నారు. మహిళా దినోత్సవాన్ని నిర్వహించి వారికి సన్మానం చేసిన బాలూ కల్చరల్ అసోసియేషన్ వారిని అభినందించారు. అందరికీ ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సభలో బల్లికురవ మండలం ఏలేశ్వరవారిపాలెంకు చెందిన అంగన్‌వాడీ భాగ్యలక్ష్మి, పట్టణానికి చెందిన మనోలత, కొటికలపూడి ఆశా వర్కర్ టీ భారతి, తిమ్మాయపాలెంకు చెందిన ఆశా వర్కర్ సంతోషంతోపాటు మరి కొందరు మహిళా మణులను చైతనయ ఘనంగా సత్కరించారు. సమావేశంలో కొరిశపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్, మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయచంద్రరావు, న్యాయవాది కుసుమలత, బాలూ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక మహిళా ప్రతినిధులు, అంగన్‌వాడీలు, వివిధ హోదాల్లో ఉన్న మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం

చీరాల: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి శాసన మండలికి పంపాలని మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. సోమవారం పలు వార్డులతో పాటు పాఠశాలలో కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావ్, బత్తుల అనిల్, కంపా ఆరుణ్‌లు ప్రచారంలో పాల్గొని ఓటర్లతో మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. నాడు నేడు కార్యక్రమంతో పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. రానున్న ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పులి వెంకటేశ్వర్లు, కుంచాల శ్రీనివాసరావు, కొమ్మూరి రాజేష్, గడ్డం వెంకటేష్, గునిమిని శివారెడ్డి, శాఖమూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు/యద్దనపూడి: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం వైఎస్సార్ సీపీ నాయకులు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక సంపత్ నగర్ కాలనీలో బీసీ నాయకుడు చిమ్మిరిబండ శ్రీను ఆధ్వర్యంలో ఓటర్ల నివాసాలకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

- వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు మండలంలోని చింతపల్లిపాడు, యనమదల, అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పట్టభద్రులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటును శ్యాంప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ దూళ్లిపాళ్ల వేణుబాబు, మండల కన్వీనర్ షేక్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు రాయి పథ్వీరాజ్, ఎస్ వెంకటప్పయ్య, షేక్ ఖాసింబీ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్, పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల సాంబయ్య, జంపని కోటి సుబ్బరాయుడు, జంపని కోటి, మారెళ్ల శ్రీధర్, మువ్వల రాంబాబు, రావి రవి, శ్రీను, మీనుగ అంకినీడు, జాగర్లమూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి విధాన సభకు పంపించాలని మండల జేసీఎస్ కన్వీనర్ కోమట్ల శివరామరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాజుబంగారుపాలెం, కడవకుదురు గ్రామాలలో ఎంఎల్‌సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ భూలక్ష్మి, శ్రీనివాసరావు, బక్కారంగారెడ్డి, నియోజక వర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మాచవరపు రవికుమార్, మండల బీసీసెల్ అధ్యక్షుడు విజయరాంప్రసాద్, పులుగు కృష్ణారెడ్డి, కంసాని బాబు, అక్కల సత్యరెడ్డి, కుక్కల రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లు పాల్గొన్నారు.

పర్చూరు: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ ఓట్ల ప్రచారం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పర్యటించారు. మాజీ జెడ్పీటీసీ కొల్లాసుబాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, సర్పంచ్ బూసిరెడ్డి శివారెడ్డి, కొల్లా శ్రీహరి పాల్గొన్నారు.



చీరాల: ఓరియంటల్ పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్లు



మార్టూరులో ఓటర్లను అభ్యర్థిస్తున్న పార్టీ నాయకులు



చింతపల్లిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చినగంజాం: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పర్చూరు: ప్రచారంలో పాల్గొన్న పార్టీ నాయకులు

పురాతన అరుదైన నాణేలు, కరెన్సీ ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన నాణేలు

స్వర్ణ(కారంచేడు): బ్రిటీష్-ఇండియా కాలంతో పాటు, పురాతన అరుదైన నాణేలతో పాటు, ఎన్నో ఏళ్ల నాటి నోట్లను స్వర్ణ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించారు. సోమవారం మండలంలోని స్వర్ణ హైస్కూల్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వ రఘురామ్ తనకు చిన్నతనం నుంచి నాణెములు, నోట్లను సేకరించడం అలవాటుగా మారింది. దీంతో ఆయన పాతకాలం నాటి అర్ధణా, అణా, బేడల దగ్గర నుంచి పైసా, రెండు, మూడు, ఐదు పైసల బిళ్లలను ఆయన ప్రదర్శనగా ఉంచారు. నోట్లలో పాత తరం రూపాయిలు రద్దు అయిన రూ 500, 1000ల నోట్ల వరకు ఈ ప్రదర్శనలో ఉంచారు. దీంతో అనేక మంది ఉపాధ్యాయులు సైతం వీటిని ఆసక్తిగా తిలకించారు. ఇక విద్యార్థులయితే వాటిని చూసి వాటిని తాకాలని పోటీపడ్డారు. అరుదైన ఈ నాణేలు, నోట్లను మా పాఠశాలలో ఉచితంగా ప్రదర్శించిన రఘురామ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాణాలతో కూడిన విద్య విద్యార్థులకు మేలు

మార్టూరు: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని పర్చూరు డిప్యూటీ డీఈవో ఏ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో జడ్పీ మరియు ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మార్టూరు, ద్రోణాదుల, కోలలపూడి హెచ్‌ఎంలు డేవిడ్,బీ చలపతి, జీ బాలకృష్ణ, ఎంఈవో వస్రాం నాయక్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన ఉప్పు రైతులు

చినగంజాం: సాల్ట్ సొసైటీ భూములను సాగు చేసుకుంటున్న ఉప్పు రైతులు సోమవారం చినగంజాం విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. చినగంజాంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మండలంలోని చినగంజాం , రాజుబంగారుపాలెం, అడివీధిపాలెం గ్రామాలకు చెందిన సాల్ట్ సొసైటీ భూముల రైతులతో పాటు నాగులుప్పలపాడు మండలం కనపర్తి ఉప్పు సొసైటీ భూముల రైతులు మాజీ సాల్ట్ సెంట్రల్ బోర్డు సలహా సభ్యుడు వలివేటి విశ్వనాథబాబు ఆధ్వర్యంలో ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఉప్పు భూములలో ఉప్పుసాగు లీజు అగ్రిమెంట్ పూర్తవుతున్నందున వాటి లీజు రెన్యువల్ చేసేందుకు అధికారులు సమ్మతించడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో వందల కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఉందని వివరించారు. రైతుల సమస్యలను ఎంపీ జీవీఎల్ నరసింహారావు ద్వారా కేంద్రానికి తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పురైతులు వాటంబేటి బసవయ్య, బొడ్డు ఏడుకొండలు, ప్రసాద్, బక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటిలోగా ఓటరు స్లిప్పుల పంపిణీ

చీరాల టౌన్: ఈనెల 13న జరగనున్న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్లకు స్లిప్పులను మంగళవారం లోగా పంపిణీ పూర్తి చేయాలని ఏఆర్వో, చీరాల ఆర్డీవో పీ సరోజిని సూచించారు. సోమవారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బందితో బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్పుల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాలకు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి డివిజన్‌లో 26,390 మంది ఓటు హక్కు పొందారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 17,626, మహిళా ఓటర్లు 8723 మంది ఉన్నారన్నారు. అలానే ఉపాధ్యాయ ఎన్నికలకు డివిజన్‌లోని 13 మండలాల్లో 1789 మంది టీచర్లు ఓటు హక్కు పొందారన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు ప్రభాకరరావు, మహేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేయాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఈఈ రామసుబ్బారావు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- రిటైర్డ్ రాజ్‌భవన్ ఈఈ రామసుబ్బారావు

చినగంజాం: టెన్త్ విద్యార్థులు ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు పాటిస్తూ మెరిట్ మార్కులు పొందాలనే లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజ్ భవన్ రిటైర్డ్ ఈఈ కర్రి రామసుబ్బారావు సూచించారు. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు హోదాలో ముఖ్య అతిథిగా పాల్గొనగా హెచ్‌ఎం డీ రత్నకుమారి అధ్యక్షత వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రామసుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందించిన సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటిస్తే మంచి గ్రేడులు సాధిస్తారన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ మంచి ఆహారాన్ని తీసుకుంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఏకాగ్రతతో చదవాలన్నారు. పాఠశాలలో విద్య బోధించే విధానం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉందని, ఈ పరిస్థితుల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో గ్రేడు సాధిస్తారనే నమ్మకం కలుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం తరఫున స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాస దీక్షితులు, శ్రీనివాసరావు, కుమార్, శంకరరావు, సూర్యనారాయణ,ఎస్ నరసింహరావు, శైలజలతో పాటు పలువురు టీచర్లు టెన్త్ విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు అక్కల రామకృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజన నూతన కార్యవర్గం ఎన్నిక

అద్దంకి: సృజన సాహిత్య సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా పనిచేసిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులను శాశ్వత కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం పట్టణంలోని రామసుశీల నిలయంలో నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా గాడేపల్లి దివాకరదత్తు, ప్రధాన కార్యదర్శిగా కే అనీలకుమారసూరి, కోశాధికారిగా ఇలపావులూరి శేషతల్ప సాయి, ఉపాధ్యక్షుడిగా ఎస్ సుబ్రహ్మణ్యం , లక్కరాజు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా షేక్ మహ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శులుగా అద్దంకి లెవీ ప్రసాద్, అనంతు నాగేశ్వరరావు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతోపాటు కాటూరి నర్సయ్య, వీరవల్లి సుబ్బారావు, జే ప్రతాప్, డీవీఎం సత్యనారాయణ, చుండూరి మురళీ సుధాకర్‌రావు, అభిమానులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించాలి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను గెలిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని 3, 4, 6 వార్డుల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు నివాసంలో సమావేశమై మిగిలిన వార్డులలో ప్రచార కార్యక్రమాలపై పార్టీ నాయకులతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే ఇండియా ఆరోగ్యం

కారంచేడు: మహిళ ఆరోగ్యమే ఇండియా ఆరోగ్యం అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నామని కుంకలమర్రు స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ పద్మావతి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని కుంకలమర్రు గ్రామంలో అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు బాగుంటుందన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కుంకలమర్రు సచివాలయ సిబ్బంది సహకారంతో ఉపాధ్యాయులు, మహిళా ఉద్యోగులు, మహిళలు, బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్స్ ఎం వీరమ్మ, వసంతవల్లి, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

చీరాల: ఆర్యవైశ్యులకు గతంలో ఏరాజకీయ పార్టీ ఇవ్వని ప్రాధాన్యత వైఎస్సార్ సీపీ కల్పిస్తోందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ ఆపార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సోమవారం కిరణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ ఆర్యవైశ్యులకు సముచిత స్థానం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. అలానే పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్‌పర్సన్ శిఖాకొల్లి రామసుబ్బులు, కమిషనర్ యేసయ్య, నాయకులు పొత్తూరి సుబ్బయ్య, గుంటూరు ప్రభాకరరావు, పెనుగొండ కిషోర్, పచ్చిపులుసు జగన్మోహన్‌రావు, గుంటూరు శ్రీనివాసరావు, చేవూరి రామయ్య, చూండూరు శ్రీను, తులాభందు సురేష్, గుండ్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి బాలకృష్ణను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు, అతిథులు